ర్యాంపుల మూత.. ఇసుక కొరత

- నియోజకవర్గానికి ఆరు ఓపెన్ రీచ్‌ల కేటాయింపు
- తెరుచుకోనివి రెండు
- కాంట్రాక్టర్ల అక్రమాలతో మూతపడినవి మరో రెండు
- ర్యాంపులున్నా ఇసుకకు ఇక్కట్లు



తవ్వకాలు నిలిపివేసిన కానూరు–పెండ్యాల ఇసుక ర్యాంప్



తీపర్రు ఇసుక ర్యాంపులో ఖాళీగా ఉన్న బాట

పెరవలి: కూటమి నేతల ప్రోద్బలంతో ఇసుక కాంట్రాక్టర్లు దోపిడీకి దిగడంతో ఇసుక ర్యాంపులు మూతపడ్డాయి. నిడదవోలు నియోజకవర్గంలోని మొత్తం ఆరు ఓపెన్ రీచ్‌లూ ప్రస్తుతం పని చేయడం లేదు. భవన నిర్మాణదారులు, ఇసుకపై ఆధారపడిన కూలీలకు ఇది శరాఘాతమైంది. ఇసుక ర్యాంపుల్లో అక్రమాలు పరాకాష్టకు చేరడంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు అవి మూతపడ్డాయి. ఇసుక కాంట్రాక్టర్లు నిబంధనలను నీళ్లొదిలి మెషీన్‌లతో ఇసుక లోడింగ్ చేయడమే గాకుండా అధిక వసూళ్లకు పాల్పడ్డారు. ఇసుక బాట లభించకపోవడం, రైతులు పంట మాసూళ్లు చేస్తుండడం వల్ల రెండు ఇసుక ర్యాంపులను తెరవనే లేదు. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా గరిష్టంగా నియోజకవర్గంలో ఆరు ఇసుక రీచ్‌లు ఓపెన్ చేయాలని ఆదేశాలు వచ్చాయి. వాటిలో నాలుగు ర్యాంపులు ప్రారంభమయ్యాయి. అయితే ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరపడంతో ఆగ్రహించిన కలెక్టర్ ఆ నాలుగింటినీ మూసివేయించారు. ఫలితంగా ఇసుక ఇక్కట్లు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొదటి సారిగా 17 ఓపెన్ రీచ్‌లను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించగా వాటిలో ఆరు నిడదవోలు నియోజకవర్గంలోనే ఉన్నాయి. వాటిలో జీడిగుంట, పందలపర్రు, కానూరు–పెండ్యాల, తీపర్రు రీచ్‌లను ప్రారంభించారు. మిగిలిన ముక్కామల, కాకరపర్రు రీచ్‌లు రెండూ నేటికీ ప్రారంభం కాలేదు.

ర్యాంపులను ఎందుకు మూసివేశారు?

కానూరు–పెండ్యాల, పందలపర్రు, జీడిగుంట ఇసుక రీచ్‌లలో భారీగా అక్రమాలు జరుగుతున్నాయంటూ ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు వచ్చాయి. దాంతో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత ఈ ర్యాంపులను సందర్శించారు. దగ్గరుండి ఇసుక ఎగుమతులు కూడా చేయించారు. వారు ఎన్నిసార్లు ర్యాంపులను తనిఖీ చేసినా కాంట్రాక్టర్ల తీరు మాత్రం మారలేదు. ఆగ్రహించిన కలెక్టర్ జీడిగుంట, పందలపర్రు రీచ్‌లను మూసివేయించారు. ఇసుక రీచుల్లో అధిక వసూళ్లకు పాల్పడుతున్నారంటూ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు టీడీపీ, జనసేన కార్యకర్తల నియోజకవర్గ సమావేశంలో బహిరంగానే ప్రకటించారు. అంతేకాదు. నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. అదీ కుదరకపోతే తామే నేరుగా కలగజేసుకుని ఆపని చేస్తామని ప్రకటించారు. దీనిని బట్టి ఇసుక రీచ్‌లలో ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

ఇసుక లేక ఇక్కట్లు

ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో ఇసుకకు తీవ్ర కొరత ఏర్పడింది. మరోమార్గం లేక కోనసీమ జిల్లా గోపాలపురం, తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వెళ్లి ఇసుక తెచ్చుకోవలసి వస్తోందని నిర్మాణదారులు చెబుతున్నారు. దూరం కావడంతో రెట్టింపు ఖర్చవుతోందని వారు పేర్కొంటున్నారు. పర్యవసానంగా గృహ నిర్మాణాలను నిలిపివేస్తున్నామని చెబుతున్నారు. ఫలితంగా నిర్మాణ రంగంపై ఆధారపడిన తాపీ మేస్త్రీలు, కూలీలు, శ్లాబ్ నిర్మాణదారులు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అధిక వసూళ్లే కారణమా?

ఇసుక రీచ్‌ల మూసివేతకు కూటమి నేతలతో కుమ్మక్కైన కాంట్రాక్టర్లు అక్రమ వసూళ్లకు పాల్పడమే ప్రధాన కారణమనే విమర్శలు వస్తున్నాయి. కానూరు–పెండ్యాల రీచ్‌లో ఒక్కో ట్రాక్టర్ వద్ద నుంచి రూ.1000, పందలపర్రు రీచ్‌లో రూ.750, తీపర్రు రీచ్‌లో రూ.500 చొప్పున వసూలు చేసినట్టు సమాచారం. లారీల వద్ద నుంచి రూ.6500 చొప్పున రాబట్టినట్టు తెలుస్తోంది. ఇసుక రీచ్‌లు ఓపెన్ చేసినపుడే ర్యాంపుల ఆదాయంలో 50 శాతం సొమ్ము తమకే ఇవ్వాలని కాంట్రాక్టర్లతో కూటమి నేతలు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలుస్తోంది. ఆ ఒప్పందంలో భాగంగానే పగలు కూలీలతోను, రాత్రిపూట మెషీన్‌లతో ఇసుక తవ్వకాలు జరిపారని చెబుతున్నారు.

ఇసుక దొరకడం లేదు



ఇసుక కోసం ర్యాంపుల వద్దకు వెళితే మూసేసి ఉన్నాయి. నియోజకవర్గంలో ఎక్కడా ఇసుక దొరకడం లేదు. గోపాలపురం వెళ్లి తెచ్చుకోవలసి వస్తోంది. ఖర్చు రెట్టింపు అవుతోంది. ఇసుక కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

–అల్లంరాజు, ట్రాక్టర్ డ్రైవర్, పెరవలి

ఉచిత ఇసుక అమలు ఉట్టిదే..



ఇసుక కొరత వల్ల ఇంటి నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఉచిత ఇసుక అని ప్రకటిస్తే ఇంటి నిర్మాణం చేసుకోవచ్చని ఆశించాం. కానీ ర్యాంపుల్లో అధిక వసూళ్లు చూసి నిరాశ చెందాం. ఉచిత ఇసుక అమలు కావడం లేదు.

–బోకే వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణదారుడు, ఖండవల్లి

ఇదీ రీచ్‌ల పరిస్థితి

నియోజకవర్గంలోని ముక్కామల, కాకరపర్రు ఇసుక రీచ్‌లను ఇప్పటికీ తెరవనే లేదు. ముక్కామల రీచ్‌కు వాహనాలు వెళ్లేందుకు బాట లేదు. కాకరపర్రు రీచ్‌కు ఉన్న పాత బాటను వినియోగించటానికి వెళితే అక్కడి రైతు రూ.లక్షల్లో సొమ్ము ఆశించారు. ఈ కారణాలతో ఈ రెండు రీచ్‌లూ ఓపెన్ కాలేదు. ప్రస్తుతం ఖరీఫ్ ధాన్యం మాసూళ్లు జరుగుతుండడంతో కానూరు–పెండ్యాల, పందలపర్రు ఇసుక ర్యాంపులను తెరిచేందుకు రైతులు అంగీకరించలేదు. నేరుగా మెషీన్‌తో ఇసుక తవ్వకాలు చేపట్టడంతో కలెక్టర్ జీడిగుంట రీచ్‌ను మూసి వేయించారు. తీపర్రు ర్యాంపులో ఇసుక తవ్వుకునేందుకు పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాలకు కేటాయించారు. కానీ ఈ జిల్లాలకు కేటాయించిన ఇసుక మేట ఎక్కడా కనిపించలేదు. అందుకు కారణం గోదావరి నదిలో నీటి ప్రవాహం ఇప్పటికీ తగ్గకపోవడమే. దీంతో జియో కో–ఆర్డినేషన్ మార్చాలని ఈ ర్యాంపు కాంట్రాక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగారు. ఫలితం లేకపోవడంతో ఇసుక తవ్వకాలు చేపట్టలేమని లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వడంతో ఇక్కడ తవ్వకాలు నిలిచిపోయాయి.

క్లుప్తంగా

జగన్‌ను కలసిన ఎస్సీ నాయకుడు ఆనంద్



జగన్‌తో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల నాయకుడు పాతాల ఆనంద్

నిడదవోలు రూరల్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నిడదవోలు మండలం కలవచర్లకు చెందిన ఆ పార్టీ ఎస్సీ సెల్ మండల నాయకుడు పాతాల ఆనంద్ తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం కలిశారు. ఎస్సీలు, సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి నేతల వేధింపులపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లినట్లు ఆనంద్ తెలిపారు.

ఆడిట్ నిర్వహణపై సీఆర్పీలకు శిక్షణ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ మూర్తి

కొవ్వూరు: లాభనష్టాల అంచనాల తయారీ, ఆడిట్ నిర్వహణపై స్వయం సహాయక సంఘాల సీఆర్పీలు అవగాహన పెంచుకోవాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ మూర్తి సూచించారు. కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు, గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల సీఆర్పీలకు బుధవారం పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ స్వయం సహాయక సంఘాలు లాభాల్లో ఉన్నాయా? నష్టాల్లో ఉన్నాయా? అనే అంశాన్ని ఎలా తనిఖీ చేయాలో సీఆర్‌పీలకు వివరించారు. ఎంపిక చేసిన సీఆర్పీలకు ఈ ఆడిట్ శిక్షణ అందిస్తున్నట్టు ఫైనాన్స్ డీపీఎం సంపత్‌కుమార్, జిల్లా ఐబీ అధికారి రత్నాకర్ తెలిపారు. ఆడిట్ నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏపీఎం కె.నిర్మల కుమారి, సీఏలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

అన్న సమారాధన

నిడదవోలు: ఏరీస్ కంపెనీ 55వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక చర్ల సుశీల, తిమ్మరాజుపాలెం లయన్స్ వృద్ధాశ్రమాల్లో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఏరీస్ సంస్థ మేనేజర్ వి.శ్రీనివాస్, ఈ ఏ దేవరాజ్, మానవత సంస్థ అధ్యక్షుడు దారపురెడ్డి సూర్యచంద్రరావు, కార్యదర్శి ముళ్ళపూడి సోమరాజు, ఏవీ రమణ, కొప్పుల వెంకటేశ్వరరావు, ఉన్నమట్ల సత్య భాస్కర ప్రసాద్, తన్నీడి బోసు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరునికి మహా రుద్రాభిషేకం



దేవరపల్లిలోని ఉమా రామలింగేశ్వరస్వామి

దేవరపల్లి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పార్వతీ సమేత ఉమారామలింగేశ్వర స్వామికి గ్రామస్తులు బుధవారం మహా రుద్రాభిషేకం నిర్వహించారు. ఉదయం ఆరు గంటల నుంచి వేద పండితులు స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అభిషేకంలో పాల్గొన్న శివ భక్తులు శివనామ స్మరణ చేశారు. అనంతరం ఉదయం 11 గంటల నుంచి గ్రామస్తులు, దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. దేవరపల్లి పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు.

విశ్వబ్రాహ్మణులు అన్నింటా పురోగమించాలి



తాళ్లపూడి కార్తిక వన సమారాధనలో పాల్గొన్న గ్రామస్తులు

నల్లజర్ల: రాజకీయంగా, ఆర్థికంగా, విద్యాపరంగా విశ్వబ్రాహ్మణులు పురోగతి సాధించేందుకు సంఘ సభ్యులు సమష్టి కృషి చేయాలని ఆ సంఘ మండల శాఖ అధ్యక్షుడు లక్కోజు రామాచార్యులు అన్నారు. కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం దూబచర్లలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వీరబ్రహేంద్రస్వామికి, కామాక్షి అమ్మవారికి పూజలు చేశారు. మహిళలకు, పిల్లలకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వన సమారాధనలో మంచి సత్యనారాయణ, పారేపల్లి మురళీకృష్ణ, రాయలవరపు నాగసతీష్, మంచి యుగంధర్, లక్కోజు దుర్గారావు, కొరపాటి జగన్నాథాచార్యులు, రాయలవరపు వీరాచారి పాల్గొన్నారు.

తాళ్లపూడిలో కార్తిక వన సమారాధన

తాళ్లపూడి: స్థానిక పుష్కర్ ఘాట్ రోడ్డులోని గోదావరి గట్టునే గల గౌతమేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం కార్తిక వన సమారాధన నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు , పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ ఆధ్వర్యంలో మహిళలు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది వరకు గ్రామస్తులు పాల్గొన్నారు. కవల శ్రీను తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాలల మహాగర్జన కరపత్రాల ఆవిష్కరణ



మాలల మహాగర్జన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దళిత నాయకులు

నిడదవోలు: అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవీప్రసాద్ పిలుపు మేరకు గుంటూరులో డిసెంబర్ 15న నిర్వహించే మాలల మహాగర్జన బహిరంగ సభ విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈమేరకు స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహం వద్ద బుధవారం మాలల మహాగర్జన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు గొల్ల నరేష్ , పళ్లెం సురేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా వ్యవహరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేవరకూ మాల సామాజిక వర్గాలను వాడుకొని అధికారం వచ్చిన తర్వాత వారి మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ జరిగిన తర్వాతే డీఎస్సీ విడుదల చేస్తామని మంత్రి లోకేశ్ చెప్పడం అన్యాయం అన్నారు. ఎస్సీ వర్గీకరణను చంద్రబాబు అమలు చేస్తే ఆయనను గద్దె దించేంత వరకూ మాలలు ప్రముఖ పాత్ర పోషిస్తారన్నారు. లక్షలాది మంది మాలలు బహిరంగ సభకు తరలి రావాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎరిక పాటి విజయ్, గొల్ల కిరణ్, ఊదరకొండ కుమార్ రాజా, చోళ్ళరాజు, కాట్రు వసంతరాజు, గుమ్మాపు చందు, బేతపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాలలో తాటాకిల్లు దగ్ధం



దగ్ధమైన తాటాకిల్లు

నిడదవోలు రూరల్: విద్యుదాఘాతం వల్ల మండలంలోని పెండ్యాల గ్రామంలో బుధవారం తాటాకిల్లు దగ్ధమైంది. వీరమల్ల వీరవేణి అనే మహిళకు చెందిన తాటాకిల్లు దగ్ధం కావడంతో ఇంట్లోని గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రూ.2 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు. స్థానికులంతా పరుగు పరుగునా ఘటనస్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు.

నేటి నుంచి రెండు పూటలా ఇంటర్ తరగతుల నిర్వహణ

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులను గురువారం నుంచి రెండు పూటలా నిర్వహించనున్నట్టు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి సతీష్ తెలిపారు. ఇప్పటి వరకూ డిగ్రీ, జూనియర్ కళాశాలలను ఒకే భవనంలో నడపడం వల్ల ఉదయం పూట జూనియర్, మధ్యాహ్నం నుంచి డిగ్రీ కళాశాల తరగతులు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో సాధ్యాసాధ్యాలను ఇంటర్ మీడియట్ విద్య జోన్–2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద ఈనెల 26న కళాశాలను పరిశీలించి వెళ్లారు. జూనియర్ కళాశాల రెగ్యులర్ పద్ధతిలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ తరగతులు నిర్వహిస్తామన్నారు. నాలుగు నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్ నడుస్తుందన్నారు. ఇంటర్మీడియట్ బోర్డు టైమింగ్స్‌ను అనుసరించి కళాశాల తరగతులు కొనసాగుతాయన్నారు. కాగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతులు మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ కొనసాగుతాయని ప్రిన్సిపాల్ జె.సునీత తెలిపారు. జూనియర్ కళాశాలకు రెండు పూటలా తరగతుల నిర్వహణపై ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. డిగ్రీ కళాశాల నిర్వహణకు ఏడు గదులు కేటాయించారన్నారు. ప్రస్తుతం ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నడుస్తున్నందున ఫస్టియర్ విద్యార్థులకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తరగతుల నిర్వహణ సమయపాలన మార్పుల కారణంగా తాత్కాలికంగా ఇబ్బంది లేకపోయినప్పటికీ భవిష్యత్తులో తలెత్తే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ప్రిన్సిపాల్ సునీత తెలిపారు.

కోడలిని వేధిస్తున్న అత్తింటివారిపై కేసు

కొవ్వూరు: భార్యను వేధిస్తున్న అభియోగంపై చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన సత్యనారాయణపైన, అతడి తల్లిదండ్రులపైనా కొవ్వూరు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కొవ్వూరుకు చెందిన నెక్కలపూడి శిరీషకు చంద్రవరం గ్రామానికి చెందిన సత్యనారాయణకు 12 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు సంతానం. ఇటీవల తనను తక్కువ కులం దానివని భర్త మానసికంగా వేధిస్తున్నట్టు, అదనపు కట్నం తీసుకుని రావాలని భర్తతో పాటు అత్తమామలు బ్రహ్మయ్య, చంద్రమ్మలు ఇబ్బంది పెడుతున్నట్టు శిరీష పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేగాకుండా భర్త వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనకు విడాకులు ఇవ్వాలంటూ కోర్టును ఆశ్రయించాడని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొంది. దీంతో ముగ్గురిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లజర్ల: విద్యుత్ లైన్ల మరమ్మతులు, వార్షిక నిర్వహణ నిమిత్తం పోతవరం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. దాంతో పోతవరం, సుభద్రపాలెం, కవులూరు, కృష్ణాయిగూడెం, నబీపేట గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. ఈ ఫీడర్స్ పరిధిలో వేకువజాము 4 నుంచి ఉదయం 8 గంటల వరకూ, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకూ త్రీఫేజ్ విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు.

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం



విద్యార్థినులకు ఆర్థిక సాయం అందిస్తున్న ప్రిన్సిపాల్ రుద్ర, క్లబ్ సభ్యులు

నిడదవోలు: పేద విద్యార్థినుల కళాశాల ఫీజుల నిమిత్తం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్‌టౌన్ శాఖ ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. స్థానిక ఎస్వీడీ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల్లోని నలుగురు పేద విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున బుధవారం రూ.20 వేలు అందజేశారు. బెంగళూరుకు చెందిన అడ్డగర్ల అన్నపూర్ణ ఆర్థిక సహకారంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుబ్బల సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ డాక్టర్ రుద్ర, వైస్ ప్రిన్సిపల్ తంబయ్య, సలహాదారు ఇంజే శేఖర్, గాలి రాఘవయ్య, పెచ్చెట్టి ఫణిసంహ, ఆనందం మురళీకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కంశెట్టి మృతి



జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్

పెరవలి: వైఎస్సార్ సీపీ నాయకుడు, శెట్టిబలిజ సంఘం రాష్ట్ర కార్యదర్శి జక్కంశెట్టి రాజేంద్రప్రసాద్ (62) పెరవలిలో మృతి చెందారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం ప్రాణాలు కోల్పోయారు. ఆయనకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. రాజకీయంగా ఎంత ఎత్తుకు ఎదిగినప్పటికీ రాజేంద్రప్రసాద్ శెట్టిబలిజ కులం కోసం వివిధ పోరాటాలు సాగించడంతో ముందుండే వారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు గెలుపు కోసం విశేషంగా కృషి చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమల్ల సత్యనారాయణ నివాళులు అర్పించారు.

ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం



దేవరపల్లిలో నిర్మించిన సిమెంట్ రోడ్డు

దేవరపల్లి: దేవరపల్లిలో గోపాలపురం రోడ్డు నుంచి వెంకటేశ్వర నగర్, భాష్యం స్కూల్ వరకూ సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఉపాధి హామీ పథకం కింద విడుదలైన రూ.25 లక్షల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఆరు మీటర్ల వెడల్పున, 242 మీటర్లు పొడవునా ఈ రోడ్డు నిర్మించారు. రోడ్డు నిర్మాణాన్ని ఇటీవల గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక సీబీఎస్ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం రెండు రోజుల్లో చేపడుతున్నట్టు పంచాయతీరాజ్ ఏఈ వినోద్ తెలిపారు.

సుందరేశ్వరుని కోవెల అభివృద్ధి చేస్తాం

కొవ్వూరు: రానున్న గోదావరి పుష్కరాలకు స్థానిక గోష్పాద క్షేత్రంలోని సుందరేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈ ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కార్తిక వన సమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఆలయ సింహద్వారాన్ని వెడల్పు చేయించాలని, వెనుక భాగంలో యాగశాల నిర్మాణం, టైల్స్ ఏర్పాటు చేయించాలని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పిల్లలమర్రి మురళీకృష్ణ, ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. 2027 గోదావరి పుష్కరాలకు గోష్పాదక్షేత్రం అభివృద్ధితో పాటు సుందరేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను అన్ని రకాలుగానూ చేపడదామని ఎమ్మెల్యే వారికి సూచించారు. చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన



ఊనగట్ల శివాలయంలో దీపార్చనకు ఏర్పాట్లు

చాగల్లు: ఊనగట్ల ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహిళలు బుధవారం దీపారాధన చేశారు. శివుని ఆకారంలో భక్తులు దీపాలు వెలిగించారు. ఆ దీపాల వెలుగులో శివుని ఆకృతి చూపరులను ఆకట్టుకుంది. అలాగే నెలటూరు రామాలయంలో ఏకాహం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అన్న సమారాధన చేశారు. బ్రాహ్మణగూడెం, ఊనగట్ల నందిగంపాడు గ్రామాల్లో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు నిర్వహించారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల యూనిటీ ఫర్ రన్



ఎన్‌సీసీ క్యాడెట్ల యూనిటీ ఫర్ రన్ ప్రారంభం

ఉండ్రాజవరం: ఎన్‌సీసీ వారోత్సవాల్లో భాగంగా ఉండ్రాజవరం ఉన్నత పాఠశాలలో బుధవారం యూనిటీ ఫర్ రన్ (పరుగు కోసం ఐక్యత) నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం కె.మాణిక్యాలరావు ఎన్‌సీసీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్‌ను పాఠశాల ఎన్‌సీసీ ట్రూప్ కమాండర్ సెకండ్ ఆఫీసర్ బీఎస్ స్వామి, పాఠశాల ఎన్‌సీసీకి చెందిన 100 క్యాడెట్లు ఉండ్రాజవరం వీధుల్లో నిర్వహించారు. ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.